సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 2 । జూన్ । 2023



ఆరు గడ్డివాములు దగ్ధం

తోటపల్లిగూడూరు మండలంలోని కోవెర పాళెంలో ఆరు గడ్డివాములు దగ్ధమయ్యాయి. సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,770
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రాము)	రూ.5,547
3 శాతం జీఎస్టీతో	రూ.5,713
నవర (8 గ్రా)	రూ.45,704

గరిష్టం/కనిష్టం 41.2 /29.5

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా గురువారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. గాలిలో 37 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

2,31,343 మందికి పెన్షన్ల పంపిణీ



నెల్లూరు: చెంచమ్మకు నగదు అందజేసిన వెల్ఫేర్ అసిస్టెంట్ రామచంద్ర

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుక ప్రక్రియ జిల్లాలో గురువారం ప్రారంభమైంది. వలంటీర్లు, సచివాయాల సిబ్బంది తెల్లవారు జాము నుంచే నగదు పంపిణీని ప్రారంభించారు. మొదటిరోజు 2,31,343 మందికి పింఛన్లు అందజేశారు. దీంతో 75.67 శాతం నమోదైంది. ఈనెల 5వ తేదీ వరకు కానుక పంపిణీ చేస్తారు.

లైవ్ డ్రాయింగ్‌లో నెల్లూరు బాలుడికి పతకం



కార్తికేయను అభినందిస్తున్న అమీర్‌జాన్

నెల్లూరు(బృందావనం): జాతీయ స్థాయి లైవ్ డ్రాయింగ్ పోటీల్లో నెల్లూరు నవాబుపేట నజీర్‌తోటకు చెందిన నల్లపాటి ఆంజనేయ వరప్రసాద్, సాయిలక్ష్మీ శ్వేతల కుమారుడు ఎన్.పునీత్ సాయి కార్తికేయ బంగారు పతకం అందుకున్నాడు. టెక్కెమిట్టలోని అమీర్ ఆర్ట్స్ అకాడమీలో గురువారం చిత్రకారుడు అమీర్‌జాన్ కార్తికేయను అభినందించారు. గత నెల 28వ తేదీన ఢిల్లీకి చెందిన 'చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్' ఆధ్వర్యంలో 'చైల్డ్ డ్రీమ్' అంశంపై లైవ్ డ్రాయింగ్ పోటీలు జరగ్గా కార్తికేయ పోలీస్ థీమ్ చిత్రం వేసి విజేతగా నిలిచినట్లు అమీర్ జాన్ తెలిపారు.


రికార్డుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

కలువాయి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను నెల్లూరు జిల్లా ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించడంతోపాటు, స్టేషన్ ఆవరణలో ఉన్న పట్టుబడిన వాహనాల గురించి ఆరా తీశారు. స్టేషన్ నిర్వహణ, ఎస్సై మహేంద్ర, పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సోమశిలలో 40.674 టీఎంసీలు



చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 40.674 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 166 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 3,700 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 230, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 94.330 మీటర్లు ఉంది.

వైద్యులు పీహెచ్‌సీల్లోనే ఉండాలి

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకట ప్రసాద్

నెల్లూరు(అర్బన్): పీహెచ్‌సీ డాక్టర్లందరూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రుల్లోనే ఉండాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకట ప్రసాద్ ఆదేశించారు. గురువారం ఆయన నెల్లూరులోని తన కార్యాలయం నుంచి జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వైద్యశాఖ పరిధిలోని డాక్టర్లు, సిబ్బంది తప్పనిసరిగా ఫేస్ రికగ్నిషన్ హాజరును వేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి సంబంధించి డాక్టర్ మధ్యాహ్నం వరకు వారికి కేటాయించిన గ్రామంలో ఓపీ సేవలు చూడాలన్నారు. తర్వాత అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసి పిల్లల ఆరోగ్యం గురించి ఆరా తీయాలన్నారు. కదలలేని రోగులు, వయో వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షించి మందులు ఇవ్వాలన్నారు.

సాగుకు సాయం.. అన్నదాత ఆనందం

రుణమాఫీ పేరుతో గత టీడీపీ ప్రభుత్వం అన్నదాతలను మోసం చేసింది. వారికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడంలో నిర్లక్ష్యం వహించింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రతి ఏడాది పెట్టుబడి సాయం చేస్తోంది. రైతు భరోసా కేంద్రాలు పెట్టింది. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన వారికి ఎప్పటికప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీని అందజేస్తోంది.

జిల్లాలో.. రైతు భరోసా – పీఎం కిసాన్ లబ్ధిదారులు : **2,14,636** మంది

వారికి అందజేసిన నగదు : రూ. **118** కోట్లు



ఇన్‌పుట్ సబ్సిడీ ఎంతమందికంటే.. : **1,579** మంది

వారికి అందజేసిన నగదు : రూ. **1.85** కోట్లు

వరుసగా ఐదో ఏడాదీ వైఎస్సార్ రైతు భరోసా

- ఇన్‌పుట్ సబ్సిడీ కూడా..
- నిధుల జమ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- నెల్లూరులో మెగా నమూనా చెక్కు అందజేసిన కలెక్టర్



పంట నష్టపరిహారానికి సంబంధించి నమూనా చెక్కు అందజేస్తున్న హరినారాయణన్

నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్‌లో భాగంగా 2023–24 సంవత్సరానికి సంబంధించి అన్నదాతలకు తొలివిడత పెట్టుబడి సాయం, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం అందించింది. ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నెల్లూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఎం.హరినారాయణన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన, వ్యవసాయ అధికారులు సీఎం సభను వీక్షించారు. మెగా నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలోకి నేరుగా నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా నగదును అందిస్తోందన్నారు. అన్నదాతలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



యంత్రాల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్



రైతు భరోసా మెగా నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు. ఆర్బీకేలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు తెలిపారు.

స్టాల్స్ పరిశీలన

వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ, అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రధానంగా చిరుధాన్యాలు, యంత్రసేవ, డ్రిప్ పరికరాలు తదితర వాటిని చూశారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ సంజనా సింహ, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, డీడీ శివన్నారాయణ, అధికారులు అనిత, నర్సోజీ తదితరులు పాల్గొన్నారు.

సాయం ఇలా..

జిల్లాలో ఈ ఏడాది రైతు భరోసా – పీఎం కిసాన్ కింద 2,14,636 మంది రైతులకు రూ.118 కోట్లు ఇచ్చారు. మూడు నెలల కాలంలో అకాల వర్షాల ద్వారా పంటలు నష్టపోయిన 1,579 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.1.85 కోట్లను ఇచ్చారు. సాయాన్ని నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేశారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



మమ్మల్ని ఆదర్శ రైతులుగా ప్రభుత్వం గుర్తించింది. ప్రతి ఏడాది రైతు భరోసా నగదు మాకు అందుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఎంతో అండగా ఉన్నారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– ముక్కు మాధవయ్య, జయలక్ష్మి ఆదర్శ రైతులు, మర్రిపల్లి, పొదలకూరు

చెప్పినవన్నీ చేస్తున్నారు



గతంలో అనేకమంది ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తర్వాత పట్టించుకునేవారు కాదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారు. చెప్పినవన్నీ చేస్తున్నారు. రైతులకు అండగా ఉన్నారు.

– ఊటుకూరు రమణయ్య, మైపాడు

అటవీ శాఖలో బదిలీలు

నెల్లూరు(అర్బన్): జిల్లా అటవీ శాఖలో పెద్దఎత్తున అధికారులు, సిబ్బంది బదిలీలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల్లూరు డివిజన్‌లో కావలి సెక్షన్ అధికారిగా పనిచేస్తున్న బాలకృష్ణయ్యను కోడూరు సెక్షన్‌కు అలాగే కొత్తపట్నంలో విధులు నిర్వహిస్తున్న అమీరయ్యను మర్లపూడి, కృష్ణపట్నంలో పనిచేస్తున్న శేషయ్యను ఆమంచర్ల, బీవీపాళెం తడలో పనిచేస్తున్న మునీర్‌బాబును కృష్ణంపల్లి, ఇక్కడ పనిచేస్తున్న చిన్న వెంకటయ్యను కావలి సెక్షన్‌కు బదిలీ చేశారు. సోషల్ ఫారెస్ట్ విభాగంలో మర్లపూడి సెక్షన్‌లో పనిచేస్తున్న అంకయ్యను పొదలకూరు ఎస్ఎఫ్ సెక్షన్‌కు మార్చారు. అలాగే 41 మంది బీట్ ఆఫీసర్లను, మరో ముగ్గురు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లను బదిలీ చేసినట్లు అధికారులు గురువారం తెలిపారు.

జిల్లా పరిషత్‌లో..

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ పరిధిలో నలుగురు ఎంపీడీఓలు, 67 మంది సాధారణ ఉద్యోగులను బదిలీ చేస్తూ సీఈఓ బి.చిరంజీవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయగిరి ఎంపీడీఓగా ఉన్న ప్రవీణ్‌ను ఆత్మకూరు, కావలిలో విధులు నిర్వహిస్తున్న సుబ్బారావును బోగోలు, దక్కిలిలో పనిచేస్తున్న కరీముల్లాను చేజర్ల, రాపూరులో విధులు నిర్వహిస్తున్న ఆమోష్‌బాబును తడ మండలానికి బదిలీ చేశారు. అలాగే ఎనిమిది మంది ఏఓలు, పదిమంది సీనియర్ అసిస్టెంట్లు, పదిమంది జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు టైపిస్టులు, 23 మంది రికార్డు అసిస్టెంట్లు, 16 మంది అటెండర్లు బదిలీ అయ్యారు.

8న రాపూరు మండల అధ్యక్ష ఎన్నిక

నెల్లూరు(పొగతోట): రాపూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చెన్ను బాలకృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఖాళీగా ఉన్న అధ్యక్ష స్థానం భర్తీ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 8వ తేదీన రాపూరులో సమావేశం నిర్వహించాలని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. 4వ తేదీలోగా మండల ప్రజాపరిషత్ సభ్యులకు నోటీసులు అందజేయాలన్నారు. కోరం లేని పక్షంలో మరుసటిరోజు 9వ తేదీ ఉదయం సమావేశం నిర్వహించాలని తెలియజేశారు.

బిట్రగుంట రైల్వేను బాగు చేయండి

- లోకో షెడ్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి
- కేంద్ర రైల్వే మంత్రికి ఎంపీ ఆదాల వినతి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆంగ్లేయుల కాలంలో దక్షిణ భారతదేశంలోనే బిట్రగుంట రైల్వే ఒక వెలుగు వెలిగింది. అయితే స్వాతంత్ర్యం అనంతరం పరిస్థితులు తారుమారయ్యాయి. ఈ నేపథ్యంలో పూర్వ వైభవం తెచ్చేందుకు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తనవంతు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు గురువారం పార్లమెంట్‌లో వినతిపత్రం అందజేశారు. బిట్రగుంటలో 1,800 ఎకరాల భూములు రైల్వే శాఖకు ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వేలో భాగంగా ఇక్కడ రైల్వే స్టేషన్ ఉంది. అనేక క్వార్టర్స్ ఖాళీగా ఉన్నాయి. దీంతో కొత్తగా భవనాల కోసం రైల్వే శాఖాధికారులు ఎలాంటి ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఇక్కడ శాశ్వత నీటి సరఫరా లైన్‌తోపాటు మెయింటెనెన్స్ డిపో కార్యాలయ భవనాలు, రైల్వే క్వార్టర్స్, మెడికల్ రిలీఫ్ వ్యాన్, రైల్వే హెల్త్ యూనిట్, వెస్ట్రన్ కోర్ట్, అధికారుల విశ్రాంతి గృహాలు, డ్రైవర్లు, గార్డుల కోసం రన్నింగ్ గదులున్నాయి. సమీపంలోనే రామాయపట్నం ఓడరేవు, అలాగే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తి కావొస్తున్నాయి. చెన్నై, కోల్‌కత్తా జాతీయ రహదారిని ఆనుకుని బిట్రగుంట రైల్వే స్టేషన్ ఉంది. అందువల్ల రాకపోకలకు, ఎగుమతి, దిగుమతులకు సులభతరం కానుంది. నెల్లూరు జిల్లాలోని బిట్రగుంటలో తగినంత అనువైన వసతులు, భూమి ఉండడంతో ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని స్థానికులతోపాటు మేధావులు కోరుతున్నారు. ఇక్కడ ఎలక్ట్రికల్ లోకో మోటో పిరియాడికల్‌ను ఏర్పాటు చేయొచ్చు. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లకు సంబంధించిన లాలాగూడా, ఖాజీపేట, విజయవాడ, గుంతకల్, గూటి తదితర షెడ్లను సమన్వయం చేస్తూ బిట్రగుంటలో ఒక పిరియాడికల్ ఓవర్ హాలింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయొచ్చు. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే ఎలక్ట్రికల్ లోకో మోటివ్‌లను సుదూర ప్రాంతాలకు పంపుతోంది. నాగ్‌పూర్, దాహోద్ మొదలైన ప్రదేశాలు ఆర్థిక భారంతోపాటు నష్టానికి దారి తీస్తున్నాయి. అదే బిట్రగుంటలో ఎలక్ట్రికల్ లోకో మోటివ్‌లను ఏర్పాటు చేస్తే మంచి లాభాలు వస్తాయి. పోర్టులు బిట్రగుంటకు దగ్గరలోనే ఉన్నందున ఎగుమతులు, దిగుమతులు చౌకగా జరిగే అవకాశముంది. బిట్రగుంటను రైల్వే అభివృద్ధి చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా గానీ జిల్లాలో పదివేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగే అవకాశం ఉంది. అంతేకాకుండా పరిసర ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందుతాయి.



కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

పూర్వ వైభవం వస్తుంది

బిట్రగుంట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తే పూర్వవైభవం వస్తుంది. విశాలమైన భూములున్న నేపథ్యంలో వల్ల రైల్వే శాఖకు సంబంధించి అక్కడ పలు పరిశ్రమలు ఏర్పాటు చేయొచ్చు. రైల్వే కోచ్‌లతోపాటు హైస్పీడ్ పార్శిల్ వ్యాన్లు, వ్యాగన్ల తయారీ యూనిట్లు స్థాపించవచ్చు. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ



ప్రథమ స్థానంలో నిలిచిన వైఎస్సార్ జిల్లా ఎడ్లు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

- వైఎస్సార్ జిల్లా అన్నంవారిపల్లి ఎడ్లకు ప్రథమ స్థానం

కొండాపురం: మండలంలోని గొట్టిగుండాల గ్రామంలో కొలువైన కోట అంకమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు గురువారం హోరాహోరీగా జరిగాయి. ఇందులో నిర్దేశించిన 20 నిమిషాల్లో 2,200 కేజీల బండను 2,112 అడుగులు లాగి వైఎస్సార్ జిల్లా కాశీనాయన మండలం అన్నంవారిపల్లి గ్రామానికి చెందిన శీలం మల్లికార్జునకు చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.60 వేలు గెలుపొందాయి. అలాగే ప్రకాశం జిల్లా బేస్తవరపుపేట మండలం జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన లక్కి శివనాగేశ్వరరావుకు చెందిన ఎడ్లు 2,100 అడుగుల వరకు బండను లాగి ద్వితీయ స్థానాన్ని సాధించి రూ.40 వేలు గెలుచుకున్నాయి. అలాగే ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావుకు చెందిన ఎడ్లు తృతీయ స్థానాన్ని సాధించి రూ.20 వేలు గెలుపొందాయి. ఈ పోటీల్లో నాలుగు జతల ఒంగోలు జాతి ఎడ్లు పాల్గొన్నాయి. విజేతలకు ఆలయ పెద్దకాపు శీలం మల్లికార్జున, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, నిర్వాహకులు బహుమతులను అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై ఖాజావలీ, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఇంటికే పౌష్టికాహారం

- జూలై నుంచి అంగన్‌వాడీల్లో అమలు
- కేంద్రాలకు దూరంగా ఉన్నవారికి ఎంతో ఉపయోగం
- రెండు విడతల్లో పంపిణీకి చర్యలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న బాలింతలు, గర్భిణులు



అంగన్‌వాడీ కేంద్రంలో ఆహారం తీసుకున్న లబ్ధిదారులు (ఫైల్)

అంగన్‌వాడీ కేంద్రాలు మహిళలు, చిన్నారుల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నాయి. కేంద్రాలకు వచ్చే వారికి సిబ్బంది పౌష్టికాహారం అందించడంతోపాటు వారి ఆరోగ్యాన్ని నిరంతరం పరిశీలిస్తూ తగిన సూచనలు ఇస్తుంటారు. కేంద్రాలకు దూరంగా ఉండి అక్కడికి రాలేకపోయే వారి కోసం పౌష్టికాహార కిట్లను ఇంటికే పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జూలై ఒకటో తేదీ నుంచి ఈ పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఉదయగిరి: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం, జగనన్న కిట్ల ద్వారా మహిళలు, చిన్నారుల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పోషకాహారం సక్రమంగా అందేదికాదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు పేరుతో అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడంతోపాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. నిరంతరం పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టారు. బాలింతలు, గర్భిణులు కేంద్రాల్లోనే ఆహారం తినే ఏర్పాటు చేశారు.

వెంటనే స్పందించి..

జిల్లాలో ఉదయగిరి, వింజమూరు, ఆత్మకూరు, కావలి, నెల్లూరు, అనంతసాగరం, బుచ్చి తదితర 14 ప్రాజెక్ట్‌ల పరిధిలోని 2,934 కేంద్రాల్లో 1,39,026 మంది చిన్నారులున్నారు. సుమారు 29 వేల మంది గర్భిణులు, బాలింతలున్నారు. కొన్నిచోట్ల గ్రామాల్లో 500 మీటర్ల నుంచి 1,000 మీటర్లు వెళ్లి ఆహారం తీసుకోవడం లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో ఇంటికే సరుకులు ఇవ్వాలని చేసిన వినతికి ప్రభుత్వం వెంటనే స్పందించింది. జూలై ఒకటో తేదీ నుంచి ఇంటికే పౌష్టికాహారం ఇవ్వాలని ఆదేశాలొచ్చాయి. జీఓ విడుదలపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏమి ఇస్తారంటే..

అంగన్‌వాడీ కేంద్రాల్లో జూలై ఒకటో తేదీ నుంచి గర్భిణులు, బాలింతలకు ఇంటికి పోషకాహారం ఇస్తారు. నెలకు 3 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, నూనె అర కేజీ, కోడిగుడ్లు 25, పాలు 5 లీటర్లు, రాగిపిండి 2 కిలోలు, అటుకులు కిలో, ఖర్జూరం 250 గ్రాములు, బెల్లం 250 గ్రాములు, చిక్కీలు 250 గ్రాములు జగనన్న కిట్‌లో పంపిణీ చేస్తారు.

- చిన్నారులకు (7 నెలల నుంచి 36 నెలలు) నెలకు పాలు 2.5 లీటర్లు, బాలామృతం 2.5 కేజీలు, కోడిగుడ్లు 25 ఇంటి వద్దనే ఇస్తారు. ప్రీ స్కూల్ పిల్లలకు రోజూ కేంద్రాల్లో 100 మి.లీ పాలు, కోడిగుడ్లు ఇవ్వనున్నారు.

జిల్లాలో..

ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లు :	14
అంగన్‌వాడీ కేంద్రాలు :	2,934
చిన్నారులు :	1,39,026 మంది
గర్భిణులు :	15,697 మంది
బాలింతలు :	13,656 మంది



అంగన్‌వాడీలో చిన్నారులతో మాట్లాడుతున్న అధికారులు (ఫైల్)

సంతోషంగా ఉంది



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నలా మహిళలను ఆదుకుంటున్నారు. గర్భిణులు, బాలింతలు వేసవి, వర్షాకాలంలో కేంద్రాలకు రావడం ఇబ్బందిగా ఉందని సర్వేకు సంబంధించి మాకు వచ్చిన ఫోన్ కాల్‌లో చెప్పాం. ప్రభుత్వం స్పందించి ఇంటికే సరుకులు సరుకులిచ్చేలా ఆదేశాలివ్వడం సంతోషంగా ఉంది.

– స్వప్న, గర్భిణి

రెండు విడతల్లో..

అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషణ కింద ప్రస్తుతం వండి పెడుతున్న భోజన కార్యక్రమం స్థానంలో జూలై ఒకటో తేదీ నుంచి సరుకులను లబ్ధిదారులకు ఇంటికే పంపిస్తాం. 1 నుంచి 5వ తేదీ లోపు మొదటి విడతలో, 16, 17 తేదీల్లో రెండో విడతలో సరుకులు అందజేస్తాం.

– సౌజన్య, పీడీ, ఐసీడీఎస్

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



స్థానికుడి సమస్యను ఆలకిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

• కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

గుడ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని, దీనివల్ల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాళ్లపాడు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ క్యాలెండర్ ప్రకారం కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇవి కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మరోమారు సీఎంగా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు కోర్సిపాటి బాపిరెడ్డి, తహసీల్దార్ సూర్యనారాయణసింగ్, ఎంపీడీఓ చంద్రసేన్, వివిధ శాఖల ఏఈలు శ్రీనివాసరావు, ఇమ్మానియేల్, రాజశేఖర్, సర్పంచ్ శ్రీనివాసులు, ఏఓ రవికుమార్, ఏపీఓ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

దగదర్తి (కావలి) : పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి సీఎం వైఎస్ జగనన్నతోనే సాధ్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తి మండలం మబ్బుగుంటపాళెం, కామినేనిపాళెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌లు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా పేదలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని తెలిపారు. లక్షలాది మంది నిరుపేదలకు అన్ని వసతులతో కూడిన లేఅవుట్‌లలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతో పాటు ఇళ్లు కట్టిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు పింఛన్ల కానుక, ఆసరా, అమ్మఒడి, రైతు భరోసా, చేయూత వంటి పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

రైతులకు మేలు చేసేలా పాలన



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల(సోమశిల) : రైతులకు మేలు చేసేలా వైఎస్సార్ సీపీ పాలన ఉంటుందని, ఇందులో భాగంగానే ముందస్తు ఖర్చుల కింద భరోసా నగదును వారి ఖాతాల్లో జమ చేశారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం మండలంలోని శంకరనగరం, ఇస్కపల్లి గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా ఐదో ఏడాది కూడా రైతు భరోసా నగదును జమ చేశారని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. ఎంపీపీ పెయ్యాల సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ ఎ.సుధాకర్‌రెడ్డి, మండల జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కేతా రామకృష్ణారెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి బిజివేముల ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గేదెల అపహరణ కేసులో ముగ్గురి అరెస్ట్

వెంకటాచలం: మండలంలోని కనుపూరు గ్రామంలో గేదెల అపహరణ కేసును వెంకటాచలం పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి గేదెలను యజమానికి అప్పగించారు. పోలీసుల వివరాల మేరకు.. కనుపూరు గ్రామంలో రమేష్‌నాయుడుకు చెందిన రూ.3.50 లక్షల విలువ చేసే ఏడు గేదెలు గత నెల 24న గ్రామంలోని చెరువు వద్ద మేత మేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు తోలుకెళ్లిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గతనెల 25న వాహనాల తనిఖీలు చేస్తున్న సంగం పోలీసులు ముగ్గురు వ్యక్తులు గేదెలను తోలుకెళ్తుండగా గుర్తించారు. పొంతన లేని సమాధానం చెప్పడంతో అనుమానం వచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో వెంకటాచలం మండలం కనుపూరు చెరువు సమీపంలో నుంచి తోలుకు వచ్చామని చెప్పారు. దీంతో ఈ విషయాన్ని వెంకటాచలం పోలీసులకు తెలియజేసి గేదెలను రమేష్‌నాయుడుకు అప్పగించి, ముగ్గురు నిందితులను పోలీసులకు అప్పగించారు. వీరు దగదర్తి మండలం చవటపుత్తేడు గ్రామానికి చెందిన దాసరి కోటేశ్వరరావు, సంగం మండలం పెరమన గ్రామానికి చెందిన గుండాల నల్లకొండయ్య, బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ గ్రామానికి చెందిన బండి వెంకటేశ్వర్లుగా పోలీసుల విచారణలో తేలింది. ముగ్గురు నిందితులను గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.52
సన్నవి : రూ.20
పండ్లు : రూ.15



గిరిజనులకు ప్రభుత్వ సాయం అందాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట) : ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ఐదు రకాల గుర్తింపు కార్డులు తప్పనిసరిగా అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ అధికారులను కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరులోని తన చాంబర్‌లో ఐటీడీఏ అధికారులతో గురువారం సాయంత్రం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గిరిజనుడికి ఆధార్‌కార్డు, రైస్‌కార్డు, ఓటరు కార్డు, ఆరోగ్యశ్రీ, ఉపాధిహామీ కార్డు తప్పనిసరిగా అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఎవరెవరికి ఏ కార్డులు లేదో గుర్తించి అందించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను అందించడమే లక్ష్యంగా గుర్తింపు కార్డులను త్వరితగతిన అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. త్వరలో ఒక యాప్‌ను రూపొందించి గిరిజనుల పూర్తి వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. అలాగే గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఐటీడీఏ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలకు వెళ్లేలా అవగాహన కల్పించాలని తెలియజేశారు. తొలుత ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ప్రాజెక్ట్ అధికారి మందా రాణి వివరించారు. సమావేశంలో ఐటీడీఏ ఈఈ వసంత, అధికారులు పరిమళ, శ్రీనివాసులు, ఖలీం పాల్గొన్నారు.

వేగవంతంగా భూసేకరణ

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ వేగవంతంగా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి వివరించారు. భూ హక్కు పత్రాల పంపిణీ, విద్యుత్, జాతీయ రహదారుల భూసేకరణ, గృహ నిర్మాణం, లబ్ధిదారులకు రుణాలు, ఎస్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్, జల్‌జీవన్ మిషన్ తదితర అంశాలపై గురువారం అమరావతి నుంచి సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు నుంచి కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ ఎం.కూర్మనాథ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, ట్రెయినీ కలెక్టర్లు విద్యాధరి, సంజన సింహ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు రోజుల్లో భూసేకరణ పరిహారం కింద రైతులకు రూ.5 కోట్లు చెల్లించామని, రాబోయే పదిరోజుల్లో పరిహారం చెల్లింపు పూర్తి చేస్తామని వివరించారు. ఇటీవల ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లా పర్యటనకు వచ్చి సమీక్ష చేశారని సీఎస్‌కు తెలిపారు. గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, భవనాల నిర్మాణాలకు సిమెంట్ సరఫరా అయ్యే విధంగా చూడాలని కోరారు. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ మొదటిదశ భూ హక్కు పత్రాల పంపిణీని ఈవారంలోగా పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ లేఅవుట్లకు విద్యుత్, తాగునీటి సరఫరాకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలన్నారు. పేదల కోసం నిర్మిస్తున్న గృహాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులలో కూలీలు ఎక్కువగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి దిశ చట్టం కమిటీ సమావేశాలు త్వరగా నిర్వహించాలని ఆదేశించారు.

వ్యవసాయ శాఖలో అధికారుల బదిలీలు

నెల్లూరు(సెంట్రల్) : జిల్లా వ్యవసాయ శాఖలో పలువురు ఏడీలను ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం బదిలీ చేశారు. జి.అనిత నెల్లూరు ఏడీ నుంచి తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు, బీపీ ప్రవీణ ఏడీ నెల్లూరు నుంచి ఏడీఏ బాపట్లకు, పి.అనసూయ ఏడీ నెల్లూరు నుంచి కందుకూరుకు, కె.కన్నయ్య ఏడీ కావలి నుంచి నెల్లూరుకు, ఎం.శేషగిరిరావు ఏడీ కందుకూరు నుంచి నెల్లూరుకు, కె.బాలాజీనాయక్ ఏడీ ఉదయగిరి నుంచి ప్రకాశం జిల్లాకు, సీహెచ్ నాగరాజు ఏడీ సూళ్లూరుపేట నుంచి కావలికి బదిలీ అయ్యారు.

పలువురు ఏఓలు కూడా..

సింగరాయకొండ ఏఓ వి.రామును కందుకూరుకు, పి.కల్పన ఏఓ నెల్లూరు నుంచి చినపావనికి, వి.శిరిషరాణి ఏఓ డీఆర్సీ నుంచి ఇందుకూరుపేటకు, యు.గీతాకుమారి ఏఓ ఇందుకూరుపేట నుంచి డీటీసీ నెల్లూరుకు, పి.చంద్రభాను ఏఓ వింజమూరు నుంచి కొండాపురానికి, ఎం.ప్రసూన కొండాపురం ఏఓ నుంచి నెల్లూరుకు, వి.రవికుమార్ కందుకూరు ఏఓ నుంచి వరికుంటపాడుకు, మహమ్మద్ ఫరూక్ ఏఓ చిన్నపావని నుంచి ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు.

కాలుష్యాన్ని నివారించాలని ఆందోళన

ముత్తుకూరు: కృష్ణపట్నం తీరంలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు బొగ్గు తరలించే కన్వేయర్ల వద్ద స్థానిక ఆర్కాట్‌పాళెం గ్రామస్తులు గురువారం ఆందోళన జరిపారు. బొగ్గు తరలించే క్రమంలో పెద్ద ఎత్తున బొగ్గు దుమ్ము గ్రామంపై పడుతోందని, ఈ కాలుష్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటి తర్వాత ప్రాజెక్టుల ప్రతినిధులు ఘటనా స్థలానికి చేరి, సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

102లో డ్రైవర్ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్) : నెల్లూరు నగరంతో పాటు కందుకూరు పరిధిలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 వాహనాల్లో డ్రైవర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని 102 వాహనాల జిల్లా మేనేజర్ బి.వెంకటరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై మినిమం బ్యాడ్జ్, హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన వారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 3న సంబంధిత డాక్యుమెంట్లతో నెల్లూరులోని పెద్దాస్పత్రి ఆవరణలో దిశ పోలీసుస్టేషన్ పక్కనే ఉన్న 108, 104, 102 వాహనాల జిల్లా కార్యాలయంలో ఇంటర్వ్యూలకు రావాలని కోరారు. ఇతర వివరాలకు 90007 44043 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 160
లేయర్ (లైవ్)	: 98
బ్రాయిలర్ చికెన్	: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 300
లేయర్ చికెన్	: 167

పసిబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

• ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్



మాట్లాడుతున్న వెంకటప్రసాద్

నెల్లూరు (అర్బన్) : పసిబిడ్డల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ సూచించారు. స్థానిక సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో పసి పిల్లల ఆరోగ్య పరిరక్షణపై వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 10 వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువును నమోదు చేయాలన్నారు. బరువుకు తగ్గ ఎత్తు ఉన్నారా లేదా పరిశీలించి కారణాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల జాబితాను సిద్ధం చేయాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారులను ఆదేశించారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ సౌజన్య మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని దగ్గరలోని పీహెచ్‌సీకి మ్యాపింగ్ చేస్తున్నామన్నారు. ఆర్బీఎస్‌కే కో–ఆర్డినేటర్ సుధీర్, అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ వీరకుమార్‌రెడ్డి, డాక్టర్ పీఎల్ దయాకర్, డాక్టర్ హరిశ్చంద్ర సతీష్, డాక్టర్ సునీల్, చిన్న పిల్లల డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ ఆమని, డీపీహెచ్ఎన్ఓ మంజుల, డిప్యూటీ డెమో కనకరత్నం, ఐసీడీఎస్ సీడీపీఓ అనూరాధ పాల్గొన్నారు.

ఆరు గడ్డివాముల దగ్ధం

• రూ.15 లక్షల ఆస్తి నష్టం

తోటపల్లిగూడూరు: మండలంలోని కోవెరపాళెం గ్రామంలో ఆరు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామస్తుల కథనం మేరకు.. కోవెరపాళెం గ్రామానికి చెందిన గంగపట్నం సాయి, కుడుముల వీరాస్వామి గ్రామంలోనే ఆరు భారీ గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి అక్కడ మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఆర్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మంటలు పెద్దవై ఆరు గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. దీంతో సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్) : వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తల్పగిరి కాలనీకి చెందిన ఎం.వాసు(19), వాణి దంపతులు. నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న ఆంజనేయ లక్ష్మీ సాయి వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో వాసు పనిచేస్తున్నారు. ఎప్పటిలానే గురువారం సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు వాసు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో ఆ సెంటర్ యజమాని సురేష్‌రెడ్డి వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు వాసు మృతిచెందాడని నిర్ధారించారు. దీంతో సురేష్‌రెడ్డి జరిగిన విషయాన్ని మృతుని భార్యకు, వేదాయపాళెం పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఘటనా స్థలంతో పాటు హాస్పిటల్‌లో మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య వాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

4న బాలబాలికల బాక్సింగ్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడా జట్ల ఎంపికలు జూన్ 4వ తేదీన ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు ది ఎస్పీఎస్ఆర్ నెల్లూరు డిస్ట్రిక్ట్ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ సీహెచ్.కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. ఈ ఎంపికలు ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు విజయవాడలోని లయోల కాలేజీలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు జరిగే పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారన్నారు. పూర్తి వివరాల కోసం సెక్రటరీ నంబర్ 94415 24931, బాక్సింగ్ కోచ్ బి.విశ్వనాథ్ నంబర్ 91215 88178లను సంప్రదించాలన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలతో రావాలన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై మైన్స్ అధికారుల దాడులు

నెల్లూరు(సెంట్రల్) : కావలి సమీపంలోని రుద్రకోట వద్ద అక్రమ గ్రావెల్ తవ్వకాలను మైన్స్ అధికారులు గురువారం రాత్రి అడ్డుకున్నారు. ఒక టిప్పర్, రెండు పొక్లెయిన్‌లను పట్టుకున్నారు. రాత్రి 9 గంటలకు ఘటన జరగ్గా రెవెన్యూ అధికారులు, పోలీసులకు సమాచారం అందించినప్పటికీ వారు స్పందించలేదు. దీంతో మహిళా అధికారి ఘటనా స్థలంలోనే ఉండాల్సి వచ్చింది. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో జిల్లా విజిలెన్స్ అధికారులు వెంకటకృష్ణప్రసాద్, బౌలా రాణి, హుస్సేని బేగం పాల్గొన్నారు.